

# గుర్నాథం అప్పు

ఎల్. శ్రీనివాస్

"ఓయ్ గుర్నాథం! ఎక్కడి నుంచో ఎం.ఓ. వచ్చినట్టు పోస్ట్‌మాన్ చెప్పాడోయ్!"

పక్కసీటు శంకరం చెప్పిన వార్త విన్న గుర్నాథం ఆశ్చర్యబోయాడు.

రెండు రోజులు కాజువల్ లీవ్‌లో ఉండి డ్యూటీలో జాయినయ్యాడు గుర్నాథం. సీటులో కూర్చుని ఫైలు తిరగేస్తున్నాడే గానీ అతడి ఆలోచన లన్నీ శంకరం చెప్పిన ఆ ఎం.ఓ. చుట్టే తిరగసాగాయి. ఎక్కడ నుంచి వచ్చి ఉంటుంది? అందరి వద్ద తాను అప్పులు చేయడమే గాని, కలలో కూడా ఎవరికీ దమ్మిడీ అప్పు ఇవ్వడే! అటువంటి తనకి ఎవరు ఎం.ఓ. చేస్తారు? అప్పు లిచ్చే ఋణదాతల్ని తప్పితే లాటరీ టిక్కెట్లు, సేవింగ్ స్కీములపైన అసలు నమ్మకం లేని తనకి పొరపాటున కూడా ఎం.ఓ. వచ్చే అవకాశం లేదు. మరి ఈ ఎం.ఓ. ఎక్కడ నుంచి వచ్చినట్టు? గుర్నాథం సస్పెన్సు భరించలేకపోతూ పోస్ట్‌మాన్ కోసం ఆత్రతగా ఎదురు చూడసాగాడు.

ఆ ఆఫీసులో ఎల్డీసీగా పనిచేస్తున్న గుర్నాథం అప్పులు పుట్టించడంలో సిద్ధ హస్తుడు. ఋణశాస్త్రంలో బాచిలర్స్ డిగ్రీ పుచ్చుకొని, అప్పు పుట్టించే కళలో నిర్విరామంగా రిసెర్చి చేసి, అపారమైన అనుభవాన్ని గడించాడు. ఎటువంటి కొత్తవారితో నైనా చనువుగా నవ్వుతూ మాట కలిపి అల్ప వ్యవధిలోనే స్నేహం చేసి, వాళ్ళ నుంచి కొద్దో, గొప్పో అప్పు గుంజటం అలవాటుగా కొనసాగిస్తున్నాడు.

గుర్నాథం దగ్గరకి తమకి రావలసిన అప్పులు తీర్చమని అడగటానికి వచ్చిన వ్యక్తులు కూడా ఒక్కొక్క సారి అతడి మాటల మెస్మరిజంలో పడి, మరో అయిదో, పదో అప్పు ఇచ్చి వెళ్ళిన సంఘటనలు అతడి నైపుణ్యానికి మచ్చుతునకలు!

గుర్నాథం స్నేహానుభవం చవిచూసిన కొందరు అతడి ఎదుటపడటానికే భయపడుతూ, జేబులను గుప్పెట్లో పెట్టుకొని తప్పించుకు తిరిగేవారు.

లంచవర్‌లో తన సీటు వైపు వస్తూ ఎదురైన పోస్ట్‌మాన్‌ని చూసిన గుర్నాథం ముఖం ఏదో చెప్పలేని సంతోషంతో వెయ్యి వోల్టుల బల్బులా వెలిగిపోయింది.

"ఎవరండీ ఎం.ఓ. చేసిన ఈ సుబ్బారావుగారు?" అన్నాడు పోస్ట్‌మాన్ సంచిలో ఉత్తరాల కట్ట బయటకు తీస్తూ.

తనకి ఎం.ఓ. రావడమే పెద్ద ఆశ్చర్యకరమైన విషయం, అదీ తాను రెండు వందలు బాకీ ఉన్న సుబ్బారావు నుంచి కావటంతో గుర్నాథం ఆశ్చర్యం రెండింతలైంది.

"ఎంత డబ్బు వచ్చింది?" ఆత్రతగా అడిగాడు.

"మరీ అంత తొందరైతే ఎట్లాగ చెప్పండి? ముందు సంతకం పెడితే మీకు డబ్బులు ముట్టజెపుతాను" అని నవ్వుతూ ఫారం మీద సంతకం తీసుకొని కమ్యూనికేషన్ స్లిప్‌తో ఒక రూపాయ బిళ్ళ గుర్నాథం చేతిలోపెట్టి వెళ్ళిపోయాడు పోస్ట్‌మాన్.

గుర్నాథం ఈసారి ఆశ్చర్యంతో నోరు వెళ్ళబెట్టాడు. అతడి కళ్ళు కమ్యూనికేషన్ స్లిప్ మీద గుండ్రని అక్షరాల వరుసల వెంబడి పరుగెత్తసాగాయి.

"మిత్రుడు గుర్నాథానికి,

"నీవు అప్పు తీసుకున్న రెండు వందలు ఈ రెండేళ్ళ కాలంలో తీర్చకపోగా, అప్పు తీర్చమని రాసిన నా అరడజను ఉత్తరాలు నీకు అందలేదని దబాయించడం విచారకరం. ఈ నెలాఖరున ఆఫీసు పని మీద మీ ఊరు వస్తున్నాను. నీ తల తాకట్టు పెట్టైనా నాకు ముట్టజెప్పవలసిన పైకం సిద్ధం చేసి ఉంచడం ఎట్టి పరిస్థితుల్లోనూ మరువద్దు. రిజిస్టర్ పోస్టులో నీకు ఉత్తరం రాయాలంటే అది మరో దండగ. పైగా పోస్టలు ధరలు పెరిగిపోయాయి. అందుచేత ఈ రూపాయి ఎం.ఓ. చేస్తున్నాను.

"ఇట్లు

"నీ మిత్రుడు

సుబ్బారావు."

చదవటం పూర్తి చేసిన గుర్నాథం ముఖం కొత్త పదిపైసల నాణెమంత అయింది. రూపాయన్నర ఖర్చుతో ఎకనాలెడ్జ్‌మెంట్‌తో రిజిస్టర్డు లెటర్ రాసినంత భద్రంగా విషయాన్ని అందజేసిన సుబ్బారావు తెలివిని మరో సందర్భంలోనైతే మనసారా అభినందించేవాడే!

ప్రపంచంలో ఇంతవరకూ ఎవరూ చేయ నన్ని అప్పులు చేసి సరికొత్త రికార్డ్ స్థాపించి, గిన్నీస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో తన పేరు నమోదు చేసుకోవాలని ముచ్చట పడ్డ గుర్నాథానికి, సుబ్బారావు అప్పు తప్పనిసరిగా తీర్చవలసిన పరిస్థితి ఏర్పడినందుకు మొదటిసారిగా నిరాశపడ్డాడు.

గుర్నాథం కళ్ళు ఇప్పుడు మరో కొత్త ఋణదాత కోసం వెదక నారంభించాయి.

** ** **

ఆశ వదులుకున్న గుర్నాథం బాకీని మొత్తానికి వసూలు చేయగలిగినందుకు సుబ్బారావు చాలా సంతోషించాడు.

ఆఫీసు పని మీద రావటం మూలంగా అదే ఊళ్ళో హాస్టల్‌లో ఉంటూ చదువుకుంటున్న తమ్ముడిని కూడా చూసేయటం జరిగిపోయింది. ఆఫీసు పనితోపాటు రెండు స్వంత పనులు చక్కబెట్టుకున్న తన తెలివికి తనని తానే లోలోన మెచ్చుకుంటూ తిరుగు ప్రయాణ మయ్యాడు. రైలు అరగంట ఆలస్య మవటం వలన ప్లాట్‌ఫారం మీద దినపత్రిక తిరగేస్తూ ఒక బెంచీ మీద కూర్చున్నాడు సుబ్బారావు.

పక్కనే నిలబడ్డ గోపాలం ఏదో అడగటానికి సంశయిస్తున్నట్లు చిన్నగా దగ్గాడు.

సుబ్బారావు తలెత్తి ఏమిటీ అన్నట్టు తమ్ముడి వైపు చూశాడు.

"మరో ఏభై రూపాయలు కావాలి అన్నయ్యా!" మెల్లగా చెప్పాడు.

"నిన్ననే నీ ఖర్చుకి మూడొందలు ఇచ్చాను కదా!" మళ్ళీ పేపరు చూస్తూ అడిగాడు సుబ్బారావు.

"నాకు తెలిసిన ఒక వ్యక్తికి అర్జెంటుగా అవసరమైతే అప్పుగా ఇచ్చాను. నాలుగు రోజుల్లో జీతం అందగానే వడ్డీల్లో పెట్టి ఇచ్చేస్తా నని మాటిచ్చాడు" గోపాలం చెప్పాడు.

సుబ్బారావు చేతిలో పేపరు మడిచిపెట్టి తమ్ముడి వైపు కొరకొర చూశాడు. గోపాలం తప్పు చేసిన వాడిలా నేల చూపులు చూడసాగాడు.

సుబ్బారావు గోపాలాన్ని చీవాట్లు పెట్టబోయి హఠాత్తుగా ఏదో గుర్తు వచ్చినవాడిలా జేబులో నుంచి గుర్నాథం ఇచ్చిన రెండు కొత్త వంద నోట్లను తీసి తన పర్సులో నోట్ల నంబర్లతో కలిపి చూశాడు. అతడి అనుమానం నిజమైంది! అవి గోపాలం ఖర్చుకి తను ఇచ్చిన నోట్లే!

సుబ్బారావు తల గిర్రున తిరిగింది.

"ఎవడు వాడు, గుర్నాథమేనా?" కోపం కొద్దీ అరచినంత బిగ్గరగా అడిగాడు సుబ్బారావు.

"అవును గుర్నాథమే!" భయం కొద్దీ ఒక్కొక్క అక్షరం నెమ్మదిగా పలికిన గోపాలం మాటల్ని వినబడనీయకుండా అప్పుడే కూత వేస్తూ ప్లాట్‌ఫారం మీదకి ప్రవేశించింది ధూమ శకటం.

★